

# అందానికి అందం



CHANDU...

పెనుమాక నాగేశ్వరరావు

**దినమణి** పేరులోనే అదోరకమయిన ఆకర్షణ. ఆ పేరులో ఏదో హుందాతనం, గంభీరత ఉన్నాయి. ఓ విశిష్టతను సంపాయించుకున్న తరువాత పొందిన బిరుదులా ఉంటుంది ఆ పేరు.

పేరుకు తగ్గ రూపం దినమణిది. బాపు బొమ్మలా ఉంటుంది దినమణి. ఇట్టే ఆకర్షించే కలువరేకుల్లాంటి కళ్ళు, మైమరపించే మందహాసం, మత్తెక్కించే మృదువైన అధరాలు- వెరసి శిల్పసుందరి దినమణి.

ఆ పెళ్ళి పందిరిలో, పెళ్ళి సందడిలో అందరి చూపులూ దినమణి పైనే. నా చూపు కూడా ఆమె పైనే.

ఎక్కడ చూసినా దినమణే. ఏమి చేసినా దినమణే. ఎవరికి ఏ వస్తువు కావాలన్నా, ఏ సలహా కావాలన్నా అడిగేది దినమణినే.

పొడవైన జడ అందంగా అటు ఇటూ ఊగుతుంటే ఒయ్యారంగా మంజీరనాదంతో నడుస్తున్న మణిని చూసి...నిజం చెప్పొద్దూ-అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాను కూడా.

"అడుగో...ఆయనేట దినమణి భర్త." ఎవరో అనటం వినిపించింది నాకు ఆ పెళ్ళి పందిరిలో.

ఓ పదిమంది ఓ చోట కూర్చొని ఉన్నారు ముచ్చట్లు చెప్పుకుంటూ.

వారందరి చూపులతోపాటు నా చూపులు కూడా నా వెనుక ఉన్న మరొక వ్యక్తి వైపు మళ్ళాయి. అంతే! వారందరిలాగే నేను ఆశ్చర్యపోయాను. అవాక్కయ్యాను కూడా కొద్ది సేపు.

"అతనా ఆమె భర్త?" ఇదే ప్రశ్న...అందరి మనసుల్లోనూ ఇదే అనుమానం. కాదు ఆయన కాకూడదు. మణి భర్త ఆ మనిషి కావటానికి వీల్లేదు. ఆ మాట నిజం కాకపోతే బాగుండు. ఇదే అందరి కోరిక.

మరోసారి పరిశీలనగా చూశాను ఆ వ్యక్తివైపు. అప్పటికే తెలిసిపోయింది, ఆయనే దినమణి భర్త అని.

"తలరాత తప్పించటం బ్రహ్మావల్లకూడా కాదు. ఎవరికి ఎలా రాసిపెట్టి ఉందో ఎవరికి ఎరుక? అంతా లలాట లిఖితం" వేదాంతం వల్లించారు తాత్వికులు.

"ఆవిడ అటువంటి మనిషిని పెళ్ళి చేసుకున్నదంటే ఏదో కథ ఉండి ఉండాల్సిందే" అనుమానం వ్యక్త పరిచారు అనుమాన రోగ పీడితులు.

"అరెరె! అన్యాయం జరిగిపోయింది" అంటూ పెదవి విరిచారు- విశాల హృదయులం అనుకొనే మరికొందరు

ఎవరేమనుకున్నా ఆయనే దినమణి భర్త. సన్నగా, పీక్కుపోయిన ముఖంతో దగ్గుతూ, రొప్పుతూ, ఓ మూలగా కుర్చీలో ఒదిగి కూర్చున్నాడా వ్యక్తి. కదలడానికి కూడా, శక్తిలేనట్లు కనిపించాడా మనిషి.

మణి పెండ్లి విషయంలో ఏదో బలవత్తరమైన కారణం ఉందనిపించింది నాక్కూడా. ఆ విషయం తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది.

ఆ విషయాన్ని ఎలా తెలుసుకోవాలా అని ఆలోచిస్తున్న నేను భజంత్రీల చప్పుడుకు ఆ ఆలోచనలలోనుండి తేరుకొని అక్షతల్తో వధూవరుల దగ్గరకు నడిచాను.

** ** **

పెళ్ళి మా పిన్ని కొడుకు రవిది. వాడూ, నేనూ చిన్నప్పటినుంచి ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళం. కలిసే చదువుకున్నాం, అందుకే ఎన్ని పనులున్నా ఓ పది రోజులు సెలవు పెట్టి రావలసిందేనన్న వాడి కోరిక ప్రకారం పెళ్ళికి వచ్చాను.

దినమణి పెళ్ళికూతురు అక్కట. అంటే రవికి ఒదినగా రన్న మాట. అంటే ఆమె భర్త రవికి, నాకు కూడా వరసకి అన్న అవుతాడు.

దినమణి భర్తను చూస్తే నాకెందుకో అతణ్ణి నిరాశ, దిగులు క్రుంగదీస్తున్నాయనిపించింది. అతని విషయాల్ని కనుక్కోవాలనే తాపత్రయంతో పరిచయం చేసుకున్నాను నా అంతట నేను.

అదేం చిత్రమోగాని బాగా పరిచయం ఉన్న వ్యక్తులే కొందరు ముభావంగా, ముక్తసరిగా మాట్లడతారు. కొత్తగా పరిచయమైన కొందరు ఎంత ఆత్మీయంగా మనసు విప్పి మాట్లాడుతుంటారు.

దినమణి భర్త కూడా రెండో కోవకు చెందిన మనిషి అని అనిపించింది నాకు.

అతని పేరు రాధాకృష్ణ. గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు. మంచి సంపాదన ఉంది. ఆస్తిపాస్తులు కూడా కొంత ఉన్నాయట.

ఓ నెల రోజులనుండి టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడట. రెండు మూడు రోజుల క్రితమే పత్యం తీసుకున్నాడట. జ్వరపు ఛాయలు ఇంకా పూర్తిగా విడిచిపెట్టలేదు. అందుకనే నీరసంగా ఉన్నాడు.

నా గురించిన వివరాలు కూడా చెప్పానతనికి. మరో మూడు, నాలుగు రోజులకు మా ఇద్దరి మధ్యా చనువు పెరిగింది.

పెళ్ళి మూడు నిద్రలు, వగైరాన్నింటికి హాజరయిన నేను ఎక్కువ కాలం కృష్ణతోనే గడిపాను

ఓ రోజు దినమణిని నాకు పరిచయం చేశాడు. మాఇద్దరికీ కాఫీ అందించి ఓ నిమిషం నుంచొని వెళ్ళిపోయిందావిడ.

"నా భార్య చాలా అందంగా ఉంది కదూ?" కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ అన్నాడు రాధాకృష్ణ.

అతనేమన్నాడో అర్థం కాలేదు నాకు. ఓ మగాడు తన భార్య అందం గురించి మరో మగాడితో మాట్లాడటమా?!

"మీరు చాలా అదృష్టవంతులు" అనిమాత్రం అన్నాను ఏమనాలో తెలియని అయోమయ స్థితిలో.

బిగ్గరగా నవ్వాడు రాధాకృష్ణ. అనుకోని సంఘటనకు ఆశ్చర్యపోయాన్నేను.

"నాకు తెలుసు. మీరే కాదు నాతో పరిచయం ఉన్నవారందరూ నేను చాలా అదృష్టవంతుణ్ణి అనే అనుకుంటారు." అన్నారు కూడా. అంతేకాదు- నా భార్యను చూసిన ప్రతి వాడూ ఈవిడ భర్త ఎంత అదృష్టవంతుడో అనుకోక మానరు.

అందరి దృష్టిలోనూ అదృష్టవంతుణ్ణయిన నేను ఎంత దురదృష్టవంతుణ్ణో నాకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఆ నిజం ఏమిటో, ఎందుకో మీకు చెప్పాలనిపిస్తున్నది. అందుకే చెప్తున్నాను. కొందర్ని చూస్తుంటే ఆత్మీయులుగా అనిపిస్తారు. మన కష్ట సుఖాల్ని వాళ్ళకి చెప్పుకోవాలనిపిస్తుంది. చెప్పుకున్న తరువాత ఎంతో భారం తీరిపోయినట్టు అనిపిస్తుంది. అందుకే చెప్తున్నాను.

"దినమణి చాలా అందమయిన మనిషి. అనదా ఆ అందంచూసే నేను మోసపోయాను."

"మోసపోయారా" ఆశ్చర్యంగా అడిగాన్నేను.

"అవును. బాహ్య సౌందర్యం చూడగలం కాని, ఆత్మ సౌందర్యం సాహచర్యంవల్లనేగా తెలిసేది."

"మణి మూర్ఖురాలు. ఎదుటివారి కష్టాన్ని కనిపెట్టే గుణం లేదు. తనూ, తన సుఖంవరకే ఆమెక్కావలసింది. ప్రతిదానికీ ఎదుటివారిలో తప్పులు వెదకటం, చులకనగా మాట్లాడటం. భర్తకి, పిల్లలకి అన్నం వండిపెట్టడం కూడా ఓ ఘనకార్యంగా, తను ఒక్కతే చేస్తున్నట్లుగా సాధిస్తుంది నన్ను. తన కిష్టమయిన వాటికోసం ఎదుటివారికి ఎంత కష్టంగా ఉన్నా లక్ష్యపెట్టదు. తన మాటను కాదంటే చస్తానని బెదిరిస్తుంది. తన కోపాన్నంతటినీ పిల్లల మీద చూపుతుంది. వాళ్ళను చావగొడుతుంది. అమ్మా నాన్నతో హాయిగా ఉన్న ఉమ్మడి కుటుంబాన్ని వేరుచేసేదాకా నన్ను వేధించింది. అంతేకాదు- దినమణి డబ్బు మనిషి. డబ్బుతోనే ఏమయినా సాధించగలం అనే మూర్ఖత్వం ఉన్నదామెలో.

ఇంతెందుకు? నా ఈ అనారోగ్యానికి కారణం కూడా ఆమే. రోగంతో బాధపడుతున్న నాకు సరైన సపర్యలు, పోషణా చేయలేదామె. నిర్లక్ష్యంగా ప్రవర్తించింది. ఫలితంగా పది రోజుల్లో నయమయ్యే జ్వరం ఇంతవరకూ తగ్గలేదు. నాకు ఇష్టమయిన పదార్థాలు చేసిపెట్టాలని, నేను త్వరగా కోలుకోవాలని ఆత్రత కనపరచేదికాదామె. నా తరఫు బంధువులెవరూ మా ఇంటికి రావటం ఇష్టం ఉండదామెకు. ఎవరయినా వచ్చినా మళ్ళీ వాళ్ళు వెళ్ళేదాకా ఆమె ముఖంలో కోపం తాండవం చేస్తూ ఉంటుంది. వాళ్ళను సూటి పోటి మాటలతో వేధించేది. వారిని చులకనగా మాట్లాడేది. దాంతో నావాళ్ళంటూ ఎవరూ రాకుండా మానేశారు. అదేమంటే తన కిష్టం లేదంటుంది. నేను ఎదురు చెబితే పది రోజులదాకా ఏడుస్తూ పడుకుంటుంది. అన్నం మానేస్తుంది. తన ఖర్మ చాలక నాకు కట్టబెట్టారని పుట్టింటి వాళ్ళని ఆడిపోసుకుంటుంది. ఇంకా ఏం చెప్పమంటారు ఇంతకన్నా ఇటువంటి ఆడదాన్ని చేసుకున్న ఏ మగాడికిమాత్రం సుఖం ఉంటుంది? అందుకే నేను దురదృష్టవంతుణ్ణి–ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో...ఎన్నెన్నో–" అంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు రాధాకృష్ణ.

పెళ్ళి పూర్తయి ఇంటికి తిరిగి వచ్చాక నా భార్య ద్వారా కూడా తెలిసింది దినమణి గురించి రాధాకృష్ణ చెప్పిందంతా నిజమని.

దినమణి శిల్పసుందరి అనిపించటం లేదు నాకిప్పుడు. శిలా ప్రతిమలా, వాసనలేని పువ్వులా, మానవత్వంలేని మనిషిలా కనిపిస్తున్నది నా కళ్ళకి. అంతేకాదు, రాధాకృష్ణకు తగిన భార్య కాదు ఆమె అనిపిస్తున్నది కూడా.

అందమైన మనస్సుకు అందహీనమైన శరీరాన్ని జయించే శక్తి ఉన్నదంటారు ఇందుకే!

*

